దౌర్భాగ్యం

'ఎలాగో వీలు జూసుకుని ఆఫీసునుంచి పెందరాళే వచ్చేస్తాను, నువుమాత్రం రెడీగా ఉన్నావట్లాయినా యెకాయెకీని నగల షాపు కెళ్ళి, కొనవలసిన కమ్మ లేవో కొని, ఇంటికి చక్కా వద్దాం; నువు కోరిన ప్రకారమే కొత్త కమ్మలు పెట్టుకుని కోడలు సీమంతాని కెళుదూగాని, సరా' అవటాని సీతప్ప ఆఫీసు కెళ్లేప్పుడు మాట యిచ్చి మరీ వెళ్ళాడు.

అంచేత రావమ్మగారు రోజల్లా మేఘాల్లో విహరించడమే గాకుండా, మూడింటికల్లా నగలషాపుకు వెళ్ళడానికి అనువైన ముస్తాబులో తయారై భర్త రాక కోసం ఎదురుచూస్తూంది.

అంతలోనే పోస్టువాడు ఒక కార్డిచ్చి వెళ్ళాడు. సత్యం రాశాడు. రావమ్మగారు అక్షరాలు కూడబలుక్కుంటూ కార్డంతా చదువుకుంది.

"బ్రహ్మశ్రీ వేదమూర్తులైన నాన్న గారికి కృతానేక నమస్కారములు. మీ కుమారుడు సత్యనారాయణ వ్రాయునది. త॥ ఇక్కడ అంతా క్షేమం. మీ క్షేమం తరుచు వ్రాయించ గోరుతాను. సీతారత్నంకు ఆరోగ్యము ఏమియు బాగుండలేదు. మా బావమరిది నరుసుకు కాళ్ళు పట్టుకుపోయాయి. నాకు మూడు రోజులుగా రక్తవిరేచనములు. గడచిన రాత్రి మన యింట్లో దొంగలు పడినట్టు కల వచ్చినది. చాలా భయపడిపోయి నిద్ర లేచినాను. అమ్మ క్రొత్త కమ్మలు కొంటున్నట్టు సోవక్కయ్య చెప్పినది. అక్కగారింట్లో అంతా క్షేమం. మీరు ఎప్పుడు బయలుదేరి వస్తారా అని వేయి కన్నులతో ఎదురు చూచుచున్నాను. అమ్మకు నా నమస్కారములు చెప్పవలెను మీ క్షేమము తరుచు వ్రాయించు చుండ వలెను. ఇట్లు, సత్యనారాయణ."

రావమ్మ ఉత్తరం పూర్తిగా చదువుకుని, తనలో తాను ప్రేమతో నవ్వుకుంటూ, "పిచ్చి కొర్నాసి!" అనుకున్నది. ఉత్తరంలో సత్యం తన కమ్మలు గురించి రాసిన ముక్క తప్ప ఆవిడ కింకేమీ తల కెక్కలేదు.

"ఇదీ ఒక శకునమే!" అనుకున్నదామె. అయే పన్లకి అనేక దాఖలాలు కనబడతాయి. అది రావమ్మ అనుభవం.

టి. వి. శంకరం

అలాంటి దాఖలాలు కనబడవో, మనం విశ్వప్రయత్నం చెయ్యిగాక, అనుకున్న పని జరగే జరగదు.

అందులోనూ ఈ కమ్మల మీద రావమ్మ చాలాకాలంగా మనసు పెట్టు కూర్చుంది. మధ్య ఆకుపచ్చ రాయీ, చుట్టూ తెల్ల రాళ్లూనూ. కావాక్షమ్మగారి చెవులకి అలాంటి కమ్మలు చూసినప్ప ణ్ణుంచీ అవి పెట్టుకోవాలని.

ఈ ఆలోచనను సీతప్ప రెండేండ్లుగా పడగొడుతూ వచ్చాడు. "అబ్బే, అవా? చెప్పకు! ఇప్పుడంతా అవే పెట్టుకుం టున్నారు. అది ఫాషనే కాదు. నీ కెందుకు నువు తొందరపడకు. ఎలాటివి కొనాలో నే చెబుతాగా!" అన్నాడు మొదట్లో. ఆ తరువాత ఇంకా పెద్దెత్తు వేశాడు. "చౌకబారు కమ్మలు నీ కున్నా యాయిరి! మళ్ళీ అలాటివే కొనడ మెందుకే, పిచ్చిదానా? కాస్త వీలూ చాలూ చూసుకుని యేకంగా రవ్వల కమ్మలే కొనేస్తాం! ఇక్కడ ఈ అరవ దేశంలో కమ్మలంటే రవ్వల కమ్మ లేనూ! రిక్షావాడి పెళ్ళాంకూడా రవ్వల కమ్మలూ, కంచి పట్టుచీరే పెట్టేసు కుంటుంది! వాళ్ళకు రవ్వలంటేలక్ష్యమే లేదు! అమ్మో! సునాయాసంగా కొనే స్తారు! అన్నం మానేసైనా సరే రవ్వలు కొనేస్తా రేవనుకున్నావోను!"అన్నాడు. చిట్టచివరకు మామూలు కమ్మలు కొన టానికి ఒప్పుకున్నాడు. "ఈ యేడుగాక ఆ పైయేటికి రవ్వల కమ్మలే కొందాం గదా అవటానుకున్నాను. కానీ మరి, నువు తొందర పెడుతున్నావాయిరి. ఇప్పటి కిలాగే వెళ్ళిపోనీ—రాళ్ళు మరీ ఖరీదైపోయాయిట. అబ్బిగాడి పెళ్ళికి ఏడువందలమ్మిన కమ్మ లిప్పుడు పద కొండు, పన్నెండొందలట! భరించ గలనా?" అన్నాడు...

ఒకే ఒకగంట గడిచింది. రావమ్మకు అయిదుగంటలు గడిచినట్టున్నది. అన్ని దాఖలాలూ ఎగిరిపోయి అనుమాన మేఘాలు కమ్ముకొచ్చాయి. "ఇవాళ ఆయన్రారు! ఇంకేం వొస్తారు? వొస్తే ఈపాటి కొచ్చీవలసిందేనూ! ఆయన మాత్రవేం జెయ్యగల్రు? వీలుపడింది కాదో యేమో! శరీరా లమ్ముకున్న బతుకైపోయె!"

క్షణక్షణానికీ దిగులు హెచ్చిపో యింది. బోసి చెవులతో వియ్యాలవా రింటి కెళ్ళటమా, లేక ఆ రాళ్ళూడిన కమ్మలే పెట్టుకు పోవడమా? అందరూ తనని చూసి నవ్విపోతారు. రోలీకంటె హీనంగా చూస్తారు—

ఈ విధంగా రావమ్మగారు విచార సాగరంలో ఓలలాడుతుండగా సీతప్ప వెయ్యిసూర్యుళ్ళ పెట్టుగా రానేవచ్చాడు, ముచ్చెమటలు దిగ్గారుతూ.

"వేగిరం! వేగిరం! ఇంకా నిల బడే ఉన్నావా? కదలాలి! కాస్తంత పొద్దుండగానే సరియైన సరుకుగా జూసి

ఎన్నిక జేసుకోవాలి. వాళ్ళెంత దుర్మార్గులు! ట్యూబులైట్లేసి పచ్చా, నీలమూ, ఎరుపూ అంతా ఒకటేలాగ కనబడేట్టు చేస్తారు! ఊఁ! ఊఁ!'' అని సీతప్ప రెండెడ్లబండిని తోలే పంపిణీలో రావమ్మను తరిమాడు.

ఆవిడకూడా ''తురుమెయిలు"లాగా కదలుతున్నట్టు అభినయంచేస్తూ, "నా ఆలస్యం ఒక్క పిసరులేదు. తలుపులకి తాళాలు వెయ్యడం తరవాయి. అన్నట్టు అబ్బిగాడు ఉత్తరం రాశాడు చూస్తారా యేవిటి?'' అన్నది.

''ఇప్పుడా? వీల్లేదు! మనం మరో పదినిమిషాల్లో నగలదుకాణంలోఉండాలి. అంతే! ఏం రాశాడేవిటి? సీతారత్నం కులాసాగా తిరుగుతోంది గదా? సోవిదేవిగారింటో అంతా కులాసాయే గదా?" అంటూ సీతప్ప వాకిళ్ళకి ఆదరాబాదరా తాళంవేసి, మళ్ళీ తీసి, మళ్ళీ వేశాడు.

అన్నిటికీ రావమ్మ, 'ఆహా! ఆహా!' అన్నది.

2

ఆ రోజు సీతప్ప లేచినవేళ అంత మంచిదికాదు. ఆయన భార్యాసహితుడై జయంతిలాల్ బన్సిలాల్ వాళ్ళషాపులోకి ప్రవేశించిన అరనిమిషానికిగాని తన యజమానికూడా అదే షాపులో ఉన్నట్టు తెలియలేదు.

"ఏవండీ, సీతప్పగారూ? మీరూ ఇక్కడికే వచ్చారే!'' అని యజమాని అనేసరికి సీతప్ప శరీరం కొయ్యబారిపోయింది. నిలువుగుడ్లు పడ్డాయి, బట్టలన్నీ చెమటతో తడిసి ముద్దయిపోయాయి..

నా భార్యకు రెండువందలు పోసి కమ్మలు కొంటున్నానని యజమానితో ఎలా చెప్పటం? చెబితే ఇంకేవన్నా ఉందా? 'ఓహో, వీడు డబ్బుకూడబెట్టాడన్నమాట' అని యజమాని అనుకోడూ?

''ఏవిటాలోచిస్తున్నారు?'' అన్నాడు యజమాని సీతప్పకేసి చూడకుండానే. ఆయన దృష్టి కేసులోని నగలమీదే ఉన్నది.

దాదాపు ఇరవై సెకండ్లపాటు స్తంభించిపోయిన సీతప్ప వాగ్ఝరి కట్టలు తెంచుకున్నది.

''అదేనండి! మా సోమిదేవి – మా అబ్బాయి పెళ్ళినాడు వియ్యాలవారిచ్చిన లాంఛనం బాపతు నా దగ్గరే దిగడిపోయింది గాదూ? మంచి ముక్కుపుడక చూసికొని పంపమంటేనూ, పోనీగదా ఆవటాని – ఒక్కగానొక్క కూతురు చూడండి! కాదనగలనా? పైపెచ్చు దాని సొమ్మేనాయిరి! స్త్రీ ధనవా, మరోటా ఏవన్నానా? ఎంత ద్రోహం! ఎంత తప్పు! ఎంత యిది! అంచేతను ఆలస్యం అమృతం విషం అని...ఏదో ఇలా–''

సీతప్ప చెప్పిన దాన్లో ముప్పాతిక ముప్వీసం యజమాని వినిపించుకోనే లేదు. ఆయన తన భార్యతో సీతప్పను గురించి చెప్పినట్టున్నాడు, ఆవిడ రావమ్మగారి దగ్గిరికొచ్చి, ''రండి, అవ్వగారూ! మా అబ్బాయి పెళ్ళి – మీకు తెలిసే ఉంటుంది. కోడలికి నగలు కొందావని వచ్చాం. ఒక రవ్వల హారమూ, ఒక డజను జతల గాజులూ, రవ్వల కమ్మలూ, ఒక రవ్వ ఉంగరమూనూ. మావారికి జాస్తి నగలు గిట్టవు స్మండీ. ఉండేవి కొద్దయినా మంచివిగా ఉండాలని...... ముక్కుపుడకా కొంటున్నారు? మీ అమ్మాయికా? ఇక్కడ చాలా మంచి ముక్కుపుడక లున్నాయి స్మండీ. ఇదుగో చూడు బాబూ...'' అంటూ రావమ్మచేత ముక్కుపుడక కొనిపించే ప్రయత్నం సాగించింది.

సీతప్పకు కాళ్ళు వణికాయి. నేరక ఒక అబద్ధం ఆడితే అది మిణ్ణాగై మెడకు చుట్టుకుంది! ముక్కుపుడక కొనడమా, మానడమా? మానాలంటే ఏది దారి? ఇంతకన్న పెద్ద చిక్కేమిటంటే రావమ్మ పులినోట పడింది. అది వొట్టి వెర్రిబాగుల మనిషి. తను కాపాడవలిసిందే తప్ప విడిచి, ఆత్మరక్షణ అసలే చేసుకోలేదు. ఏది దారి? ఏది దారి?

సీతప్ప తన యజమాని చెంతనే నిలబడి, ఆడవాళ్ళిద్దరూ ఒకొక్క నగల కేసే చూస్తూ దూరంగా వెళ్ళిపోవటం గమనించాడు. రావమ్మ కూడా ఏదో మాట్లాడుతోంది, యజమాని భార్య నవ్వుతోంది! ఖత్తు కలిపేసింది మొత్తానికి! నయవే!

సీతప్ప ధైర్యంచేసి, ''మీవాళ్ళేవైనా నగా నట్రా తీస్తున్నారా యేవండీ? ఈ

రోజుల్లో అదే బెస్టు సేవింగండీ! పడుంటుంది! బాంకుల్లాటివి దివాలా తీసేస్తున్నాయి చూడండీ! బంగారం కొని పడేస్తే వడ్డీ దండుగుండదండి. బంగారం ధర పాపంలా పెరిగిపోతున్నది కాట్టండీ?" అని సొద ఆరంభించాడు.

"నగలు మా కోడలికి. ఈ మాసం లోనేగా మా అబ్బాయి పెళ్ళి? ఏడెనిమిది వేల నగలు అదివరకే ఆర్డరిచ్చాం. ఇవాళ తీసుకుపోతున్నాం.'' అన్నాడు యజమాని.

ఏడెనిమిదివేల రూపాయల నగలే! సీతప్పను ఎవరో మాడుమీద గుర్రపు లాడంతో బలంగా కొట్టినంత పని అయింది.

వాళ్ళు మాట్లాడుతుండగానే జయంతిలాలో, బన్సిలాలో, లేక వారి దగ్గిర బంధువో టిస్యూ పేపరు పొట్లాలూ, పెట్టెలూ ఒక పళ్ళెంలో పెట్టి యజమాని కూచునిఉన్న చోటికి తెచ్చాడు. రాళ్ళ నెక్లెస్, గాజుల జతలు, రవ్వల కమ్మలు, రవ్వల ఉంగరం! సీతప్పకు కళ్ళు చెదిరాయి. ఆడవాళ్ళకూడా వచ్చి వాటిని చూశారు! రావమ్మక్కూడా కళ్లు బైర్లు కమ్మాయి.

యజమాని చెక్కురాసి ఇచ్చాడు. అట్టపెట్టెలు తీసుకున్నాడు. యజమాని భార్య తన రిస్టువాచీ చూసుకుని భర్తతో, ''మనం ఇంటికి వెళ్ళి షోకు అందుకో

"క్రొత్తగా కొనుక్కెళ్తూగూడా చేతులూపుకుంటూ తీసుకెళ్ళకపోతే, టాక్సీ పిలవకూడదూ."

గలఁవా?'' అన్నది. యజమాని తన రిస్టువాచి చూసుకుని, "లేం," అన్నాడు.

ఆయన చప్పున సీతప్పకేసి తిరిగి, "ఏఁవండీ, వీటిని మీ ఇంటికి పట్టుకెళ్ళి రేపు ఉదయం మా ఇంటికి చేర్చగల్రా?" అన్నాడు.

"ఓ, దానికేం భాగ్యవండీ? బరువా ఏవన్నానా?" అంటూ సీతప్ప వణుకుతున్న చేతుల్తో ఆ పెట్టెలు యజమాని దగ్గిర్నుంచి అందుకున్నాడు.

యజమానీ, భార్యా వెళ్ళిపోయాక రావమ్మ, ''అంతా బాగానేఉంది గాని మనం వచ్చిన పని మాత్రం అట్టే ఉండిపోయింది," అన్నది

సీతప్ప మానసికంగానూ, శారీరకంగానూ కూడా దివాలాతీసిన వాడిలా అయిపోయాడు. యజమాని తనని నమ్మి తన చేతికి ఎనిమిదివేల రూపాయల సరుకు ఇచ్చినందుకు సీతప్ప మనసు గంతు లెయ్య గోరుతోంది. ఇంత భారం తన

పైన పడినందుకు అది పట్టరాని దిగులుకు కూడా గురిఅవుతోంది. ఈ ద్వంద్వం సీతప్పని రాచి రంపాన పెట్టేస్తోంది.

"అమ్మగారికి ముక్కు పుడకా కావాలి ?" అన్నాడొక లాల్ వంశస్థుడు.

"కాదండీ, కమ్మలు. మధ్య ఆకుపచ్చ రాయి ఉండి చుట్టూ తెల్లరాళ్ళుంటాయి చూడండీ — " అని రావమ్మ ఆరంభించింది.

"మధ్య ఎఱ్ఱరాయి ఉంటే పనికిరాదాండీ ? నన్నడిగితే అది మరింత బాగుంటుందండీ. ఇప్పుడు పచ్చరాయి ఫాషను కాదండీ. మాదేముంది ? వెయ్యమంటే వేస్తాము. ఆర్డరిచ్చిపొండి అయినా ఎఱ్ఱరాయి చూడండి. చూస్తే తప్పేమీ ?"

క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్ అని కవి అన్నట్టుగానే రావమ్మ మూడేళ్ళుగా పచ్చరాయిని మోహించిన దైనప్పటికీ, ఎఱ్ఱరాయి చూడగానే, "ఇదే బాగున్నట్టుందేఁవండీ ! మీరు కూడా చూడండీ !" అని సీతప్పతో అన్నది.

"బాగుంటే ఇదే తీసుకో, నన్ను చంపకా !" అన్నాడు సీతప్ప.

తాను మోజుపడి ఇంతకాలానికి కమ్మ కొనేదాకావస్తే తన భర్త అలా చీదరించుకుకోవడం రావమ్మకు దుఃఖకునంగా తోచింది.

"మీరు బాగుందంటేనే కొంటాను లేకపోతే వచ్చినదారే పోదాం. పై సంవత్సరందాకా ఇలానే ఉండిపోతాను. ఇంతకాలం ఉన్నాను కానా ?" అన్నది రావమ్మ.

ఈ మాటతో సీతప్ప నీరసవంతా విచ్చిచక్కాపోయింది. తన భార్య ఏకంగా రవ్వల కమ్మలకి గాలాం వేస్తోందనుకున్నాడో యేవో, "అబ్బెబ్బె ! అదేవిటి మళ్ళీనూ! ఎలాగో ఇంతదూరం రానేవచ్చాం. పని వెళ్ళమార్చుకునే పోదాం ఏఁవిటంటావూ ? మధ్య ఎఱ్ఱ రాయా ? బాగానే ఉందికాదూ. అదేదో పువ్వులా వుంది !" అన్నాడు.

"హమ్మయ్య ! మీక్కూడా నచ్చింది గదా అయితే మరి బేరవాడి కొనీయండి !" అన్నది రావమ్మ. జయంతిలాల్ వంశంలోగాని, బన్సీలాల్ వంశంలోగాని బేరాలంటూ లేవు. అయినా భార్య ఎదట తేలిక్కైపోకుండా ఉండగలందుకు సీతప్ప కూలిలో బేరవాడాడు. బంగారంలో బేరమాడి లాభంలేదు. సీతప్ప చెప్పేదేదో చెప్పనిస్తూ దుకాణంవాళ్ళు బిల్లు వేసేదేదో వెయ్యనేవేశారు.

రావమ్మ కమ్మలుకూడా చేర్చి ఒకే బంగీకట్టి ఇచ్చారు. దాన్ని అతిభద్రంగా సీతప్ప చంకను పెట్టుకుని పత్నీసమేతంగా జయంతిలాల్ వాళ్ళ మెట్లుదిగాడు.

3

ఇల్లు చేరుకున్నాక భార్యాభర్తలిద్దరూ ఓపావుగంటసేపు స్వర్గంలో

ఉన్నట్టుగా భావించుకున్నారు. రావమ్మ కొత్తకమ్మలు పెట్టుకుని అద్దంలో చూసు కుంటూ, ''బాగున్నాయి కాదూ ? నా మొహమే మారిపోయింది !'' అన్నది.

''ఏదీ, నాక్కనిపించదే ? ఎలా చెప్పడం ?'' అన్నాడు సీతప్ప.

రావమ్మ తన శక్తినంతా వినియోగించి మొహం అద్దంవేపునుంచి సీతప్ప వేపుకు తిప్పింది.

"ఓ, బేషుగ్గా ఉన్నాయి ! డబ్బు ! డబ్బుపోస్తే కొండమీది కోతి దిగొస్తుం దేవిటనుకున్నా వేవిటోను ! ఇంకా డబ్బు పెట్టావూ, ఇంకా అందమైన సరుకొస్తుంది. పిండికొద్దీ రొట్టి ! ఎంత చెట్టుకంతగాలి !" అంటూ సీతప్ప అయోమయంలో పడ్డాడు.

"ఏవిటో అనుకున్నాను, ఆవిడకేవీ గర్వం లేదుస్మండీ ! యెంత ఇదిగా మాట్లాడింది ! డబ్బున్నవాళ్ళుగదా ఎంత అతిశయం ఉంటుందో అనుకుంటాం."

"అది పొరబాటు. అన్నీ ఉన్న విస్తరి అణిగుంటుంది. ఏవీలేని విస్తరి ఎగిరెగిరి పడుతుంది ! వాళ్ళకేం ? లక్షాధికార్లు ! కోడలికి పదివేల్రూపాయల నగలు అలా సునాయాసంగా కొనేస్తారు. కొడుక్కి పాతికవేలు కట్నం సునాయాసంగా పుచ్చుకుంటారు. నడమంత్రం మనుషులకే లేనిపోని అదిరిపాట్లన్నీనూ. కంచు మోగినట్టు కనకంబు మోగునాఅన్నాడు.. అదటుంచు. ఇవతల నేనున్నానుగానూ మరి ? నన్నుగురించి ఆయనకు చెడ్డ గురి. ఎన్నిసార్లన్నారుగాదు – నేలేక పోతే ఆఫీసు ఒక్కపూట జరగదని ? ఆవిడకాపాటి లౌక్యం తెలియదా ఏఁవిటి? నిన్ను మంచిగాచూస్తే నన్ను చూసినట్టే. మనని మంచిగా చూట్టం వారికేలాభం... నువ్వాగు ! ఈ ఒక్కప్రశ్నకి సమాధానం చెప్పు నా మీద ఎంతయిది లేకుండానే, 'ఇదుగో తొమ్మిది వేలు ఖరీచ్చేసే నగలు ! నీలో నాకు ఎంత నమ్మకవుందో చూడు ! వీటిని నీ పరం చేస్తున్నాను. రేపు వాటిని భద్రంగా మా యింటికిచేర్చే పూచీ నీదీ !' అని నా చేతికి సరుకిస్తాడా ! దాన్లోనే తెలిసిపోతోందిగాదుటే, వెర్రిదానా ? అన్నవంతా పట్టిచూడాలా ?" అంటూ సీతప్ప ఏకపాత్రాభినయంలో పడిపోయాడు.

ఇంతసేపూ తన కమ్మలను – అంటే కమ్మలు ధరించిన తన మొహాన్ని – అద్దంలో చూసుకుంటున్న రావమ్మ, ''నేను చాలా ముసిలిదాన్లాగా కనిపిస్తానా ఏవిటి చెప్మా ?'' అన్నది.

సీతప్ప ధోరణికి బ్రేక్ పడింది. "ఆఁ, ఆఁ ? ఏవిటదీ ?" అన్నాడు.

''ఆవిడ నన్ను అవ్వగారూ అని పిలిచిం దెందుకో ? బోసి చెవులతో నేను అవ్వలాగా కనబడి ఉంటానా ?" అన్నది రావమ్మ.

''అదేవిటీ ? ఆవిడా ఇంచుమించు నీయీడుదే. మహా ఉంటే ఓ పదేళ్ళు

చిన్న ఉండేను. ఏదో మాటవరసగా అనుంటుంది. ఓ వేళ అక్కగారూ అంటే నీకు అవ్వగారులా వినిపించిందేమో. అంతే తప్పవిడిచి వాళ్ళెక్కడా - వాళ్ల మర్యాదా ఎక్కడా !..."

"అన్నట్టు అబ్బిగాడు ఉత్తరంలో నా కమ్మల మాట కూడా రాశాడండోయ్. ఉత్తరం ముక్క ఎక్కడ పెట్టానబ్బా ?...ఇదుగో ! చూస్తూండండి, ఇప్పుడే నేను పార్వతమ్మగారికీ శుభవార్త చెప్పొస్తా. పాపం, ఆవిడ కొత్త కమ్మలు కొనుక్కోవమ్మా అని తెగ పోరుతోంది, చూసి సంతోషిస్తుంది.''

సీతప్ప చత్వారం కళ్ళజోడు తీసి కొడుకు రాసిన కార్డుముక్క చదవసాగాడు.

రావమ్మగారు మరి కాస్సేపటికి పార్వతమ్మగారితో సహా మరీ వచ్చేసరికి సీతప్ప కొయ్యబారిపోయి కొద్దిగా వణుకుతున్నాడు. చేతిలో సత్యం రాసిన ఉత్తరం ఉన్నదిగాని ఆయన దృష్టి దానిమీదలేదు. ఆమాటకొస్తే ఆయన దృష్టి దేనిమీదా లేదు. సమయానికక్కడ డాక్టరెవరన్నా ఉంటే కళ్ళముందు వేళ్ళు ఆడించి ఉండును.

"ఏవిటండీ ? ఏవిటలా చూస్తున్నారు ?" అన్నది రావమ్మ.

సీతప్ప గద్గదస్వరంతో, "ఏవీ భయం లేదు. నువ్వేమీ కంగారు పడకు. ఎలా జరగవలిసుంటే అలా జరుగుతుంది. ఆ ఈశ్వరుడు కూడా తప్పించలేడు. కొందరి కలలు నిజవవుతాయి ! ఏదో కీడు జరగబోతోందని నాకు ఈరోజు లేచింది లగాయతూ అనిపిస్తూనే ఉంది. కమ్మలు కొనడంకంటె గొప్ప విపత్తేమీ జరగదులే అవటానుకున్నా ! అంత సులువుగా పోతుందా ? మనకి రోజులు బాగా లేకే ఈ నగలు నా పాల పడ్డాయి. వాటిని దొంగలెత్తుకుపోయారో ఇంక మనపని తిరుక్షవురమే ! అంత సొమ్ము పోయాక ఊరుకుంటారా యేవిటి ? కక్కమంటారు ! హరిశ్చంద్రాదులకు తప్పలేదు ! పాండవులకు తప్పలేదు !..." అంటూ డగ్గుత్తికపడి ఇంకేమీ అనలేకపోయాడు.

పార్వతమ్మగారు పాపం, ఆదుకుని, "అన్నగారూ, అసలు విషయం ఏవిటి ? ఎందుకు ఉత్తినే బెంబేలుపడి పోతారు?" అని దక్షతతో అడిగింది.

సీతప్ప కార్డు చదివి వినిపించాడు. అబ్బిగాడికి కల రానే వచ్చింది. ఇవాళే బోలెడంత ఖరీదైన నగకట్టుకు తాను బాధ్యత వహించవలసి వచ్చింది.

"అవును స్మండీ. దొంగతనాలు పెచ్చుమీరి పోయాయి. దొంగలు పేట్రేగిపోయారు. మన వీధిలో రెండు రాత్రులు వరసగా రెండిళ్ళలో దొంగలు పడ్డారు. నిన్నగాక మొన్న ఒకేసారి నాలుగిళ్లలో జొరబడి అందిందల్లా ఎత్తుకుపోయారు. ఈ పోలీసులంతా దేనికో !'' అన్నది పార్వతమ్మగారు.

సీతప్ప ఆవిడతో పోటీపడి పత్రికలో చదివిన దొంగతనాలన్నీ ఏకరుపెట్టి మరింత దడ పెంచుకున్నాడు.

"ఎన్నిరకాలదొంగతనాలో చెప్పలేం, అన్నగారూ! మీటరు చూడాలని పది కొండు గంటల వేళ పట్టపగలు ఇంటో కొచ్చాట్ట. మొగుడాఫీసు కెళ్ళాడు. కొంపలో ఒక్కత్తే ఆడది. కత్తి చూపించి, అరిస్తే చంపేస్తానని బెదిరించి, నగలూ, బట్టలూ, డబ్బూ అంతా ఊడ్చుకుపోయాట్ట," అన్నది పార్వతమ్మక్కయ్యగారు.

"హమ్మయ్యో! కుక్కను పెంచితే దొంగల్రారు!" అన్నది రావమ్మ. పిచ్చిది.

"కొంతలో కొంత నయం. అరుస్తుంది," అన్నాడు సీతప్ప. పిచ్చిన్నరవాడు.

"ఏడుస్తుంది!" పార్వతమ్మగారు కుక్కలన్నింటినీ కొట్టి అవతల పారేసింది. "ఎవడు ఒక బిస్కత్తు ముక్క వేసినా తోకాడిస్తుంది. ఆపాటి దొంగవాడికి తెలీదా? మన వెనక వీధిలో చెట్టియారుగారింటో నా అంత కుక్క ఉన్నదండోయ్, అన్నగారూ! దాన్ని మేపటం ఎవరి తరం! ఎవరేది పెట్టినా దాన్ని తిననిచ్చారు. అది ఆ చుట్టుపక్కల మూడిళ్ళలో వారాలు చేసుకునేది. ఏమయిందనుకున్నారు? ఇంటిల్లిపాదీ ట్రిప్లికేను పెళ్ళి కెళ్ళారు. వాళ్ళు వచ్చే సరికి



"పది రూపాయిలుంటే ఇవ్వు, మళ్ళీ ఇస్తా. నా దగ్గరున్నదంతా బ్యాంక్‌లో వేశా. ఇప్పుడు అవసరమొచ్చింది."

"ఇస్తాగాని, ఇదికూడా బ్యాంకులో వేసేవ్!"

ఇల్లంతా ఖాళీ. దొంగలు పూచికపుల్ల మిగల్చకుండా ఊడ్చేశారు. నా అంత కుక్కా వరండాలో పడుకుని గుర్రుపెట్టి నిద్రబోతున్నది!"

"దొంగలు మందు పెడతారేమో!"

"మందంటే గ్యాపకవొచ్చింది. నాలుగిళ్ళు దోచారంటినే, ఒక్కఇంటివాడైనా లేవలేదుటండీ. గాఢ నిద్ర! ఈ దొంగలు ఏదో మత్తుమందు చల్లుతారుటండీ. అంతే ఒళ్ళుమరిచి నిద్రపోతాం! వాళ్ళ పని వాళ్ళు చూసుకుపోతారు!...కుక్కను నిజంగా పెంచాలంటే జాతి కుక్కను కొనాలి. ఇంటోవాళ్ళు తప్ప ఇంకెవరికీ అది మాలిమి కాకుండా చూడాలి. దానికి మదమాంసాలు బాగా పెట్టాలి. అప్పుడది దొంగ దొరికితే చీల్చేస్తుంది. పై వీధి

నాయుళ్ళింటో అలాటి కుక్క ఉంది. దానికింద వాళ్ళకి నెలకు నూరు రూపాయలు ఖర్చుట ! మనం భరాయించ గలవాఁ ?" అన్నది పార్వతమ్మక్కయ్య గారు.

"ఏవండోయ్, పార్వతమ్మక్కయ్య గారూ 'ఆ ఇనప బీరువా ఒకటి కొనితెచ్చి కొంపలో పారేద్దురూ !' అని ఎన్నిసార్లు పోరానో అడగండి. విన్నారుకారు !" అని రావమ్మ ఫిర్యాదు చేసింది.

"ఇవాళంటే ఈ గత్తరొచ్చిపడింది గాని మన కేవుందే ఇనప్పెట్లో దాచుకుందుకూ ? నా రామకోటి చోరులు కోరని నిధిగదా !" అన్నాడు సీతప్ప.

"అదేంమాట, అక్కగారూ? ఇవాళ కమ్మలు కొన్నాంగామూ ? మన ప్రాణానికి ఇవి దొంగా డెత్తుకొపోతే చాల్దూ ?" అన్నది రావమ్మ.

"అదే పొరబాటు. ఇంటో బీరువా ఉందని తెలిసిన మరుక్షణం నుంచీ దొంగాళ్ళు ఇంటిచుట్టూ కాకుల్లా తిరుగుతారు. నీకు తెలీదుగాని, ఇనప బీరువాలు అమ్మే కంపెనీల్లో ఈ దొంగాళ్ళ మనుషులుంటారు. 'ఒరే ఫలాని ఎడ్రసుకు ఇవాళ ఒక బీరువా వెళ్ళింది' అవటాని వాడు దొంగాడికి టెలిఫోన్‌లో చెప్పేస్తాడు. ఇంకేవుందీ ?" అన్నాడు సీతప్ప, ఆడాళ్ళేగదా అని కోసిపారేస్తూ.

కాస్సేపు ఎవరి ఆలోచనల్లో వారుండిపోయారు. సీతప్పకు గుండెలో వణుకు తెరలు తెరలుగా వస్తున్నది. ఈ రాత్రి తెల్లారడ వెలాగ ? ఈ భయం తెరలు తెరలుగా రావడాని క్కారణం సీతప్పకు చటున అర్థమయింది తాను ధైర్యం తెచ్చుకోవటానికి చేసే ప్రయత్నం విఫలమైనప్పుడల్లా భయం రెట్టింపవుతోంది. అంతకంటె భయపడుతూ ఉండడమే క్షేమంగా ఉంది.

"మాటల సందట్లో టైమే తెలీలేదర్రా. నే వెళ్ళి వంటపని చూసుకోవాలి వస్తా. ఈ రాత్రికి దేవుడిమీద భారం వేసి ఎట్టాగో గడిపెయ్యండి. ఏం చేస్తాం? అన్నింటికీ వాడే ఉన్నాడు,'' అంటూ పార్వతమ్మగారు లేచింది.

"ఇంతవరకూ మమ్మల్ని ఆ శ్రీరామచంద్రమూర్తి వారే కనిపెట్టి ఉన్నాడు. అంధా వాడి దయ ! అయినా, అక్కగారూ, ఈ రాత్రికి మీరుకూడా మాకు తోడుండకూడదూ ? మనిషికి మనిషి తోడు ! ఏవంటారు ?" అన్నాడు సీతప్ప దీనంగా.

"మావాడు ఊళ్ళో లేడుగదా, అన్నగారూ ! కోడలు ఒక్కతే ఉండదూ ? మరేం భయంలేదు. ఇప్పుడు మూణ్ణాళ్ళుగా ఇంటో నేనూ అదీనూ. మాకులేని భయం మీకేమిటి ?" అంటూ పార్వతమ్మ సహాయ నిరాకరణం చేసి వెళ్ళిపోయింది.

"ఎందుకైనా మంచిది, వీధి వాకిలి తాళంవేసిరండి. చచ్చిగీపెట్టినా

తియ్యొద్దు — బ్రహ్మదేవు డొచ్చే ది," అన్నది రావమ్మ.

"కాకపోతే ఏవిటి? నీ కెందుకు కంగారు? తెల్లార్లూ మేలుకుందాం. దీపాలన్నీ వెలిగించి ఉంచుదాం. దొంగాడు దీపాలున్న ఇంటోకి రాడు," అన్నాడు సీతప్ప గుండె రాయి చేసుకుని.

4

ఆరాత్రి ఇద్దరికీ అన్నం సయించ లేదు. రావమ్మకు దొంగల ఆలోచన ఏవీ లేదు. తాను కమ్మలు పెట్టుకుని వెళ్ళినప్పుడు సోమిదేవి ఏవంటుంది? పాపు వాడు చెప్పింది నిజం — ఈ కమ్మ లే బాగున్నాయి. ఇంకోరూ ఇంకోరూ పెట్టుకుంటే ఏవోగాని తన మొహానికి నప్పాయి. అవిడ అక్కగారూ అనే ఉంటుంది — ఎంచేతో తనకు అవ్వగారూ అన్నట్టు వినిపించింది. పాపం, ఈ కమ్మలు ఏవేళ కొన్నారోగాని, ఆయన వాటికేసి చూసిన పాపానకూడా పోలేదు— దొంగాడి భయం ఓటి వచ్చిపడిందాయిరి! చాదస్తం మనిషి! ఏం దొంగాడు? ఇంటో ఇంత ఖరీదైన నగకట్టున్నట్టు ఎవరికి తెలుసు — ఒక్క పార్వతమ్మగారు తప్పితే?

సీతప్ప నట్టింటో నిటారుగా కూచుని రామకోటి శరవేగంతో రాస్తున్నాడు. రావమ్మ గోడకి చేరగిలబడి కూచుంది.

"కన్ను మూసేవుస్మీ! నిద్రపోగలవు! మరేం భయంలేదు. కంటికి రెప్ప

"ఏరా! ఇంకా బడికెళ్ళలేదు. క్లాసు పుస్తకాలన్నీ కొనిస్తినిగా!"
"పుస్తకాలన్నీ కొనిచ్చారు కాని వాటిని రోజూ బడికి తీసుకెళ్ళేందుకు బండి కొనివ్వలేదు.

తోడన్నారు," అంటూ సీతప్ప రామకోటి బరికేస్తున్నాడు.

రావమ్మ మధ్యమధ్య చెవులు తడివి చూసుకుంటూ కమ్మల్ని ఆపేక్షగా నిమురుతున్నది. దీపాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. ఒక్కసారి అద్దంలో చూసుకుంటే బాగుణ్ణు, కాని —

రాస్తూరాస్తూన్న సీతప్ప తలఎత్తి రావమ్మకేసి చూశాడు. రావమ్మ గోడకు చేరగిలబడి కూచుని నోరు తెరుచుకుని నిద్ర పోతున్నది.

"ఇదుగో, ఏమేవ్? లే, లే! ఇలాగైతే ఈ రాత్రి వెళ్ళమారినట్టే," అన్నాడు సీతప్ప.

"అబ్బ! మీరు మేలుకునే ఉన్నారు గాదుటండీ? మీకు నిద్ర తూగొస్తే నన్ను లేపండి. ఇద్దరమూ జాగారం దేనికీ?"

అంటూ రావమ్మ కొంగు పరుచుకుని నడుం వాల్చి బహిరంగంగా నిద్ర కుపక్ర మించింది.

సీతప్ప రామకోటి రాస్తూనే నిద్ర పోయి ఉండాలి. ఎవరో ఒక కారులో డబ్బు పెట్టుకుని వేగంగా పోతున్నట్టూ రెండో కార్లో కళ్ళకు నల్లగంతలు కట్టుకున్న వాళ్ళు వెంబడిస్తున్నట్టూ కల వచ్చింది.

కారు హారను చప్పుడుకు సీతప్ప ఉలికిపడి లేచాడు. తమ ఇంటి బయటే ఎవరో హారన్ కొడుతున్నట్టు తోచింది.

సీతప్ప రహస్యంగా భార్యను లేపి, "బయట దొంగలేనేమో హారన్ కొడుతున్నారు. మనం తలుపు తీశామన్నట్టాయినా పిస్తోళ్లతో మనని కాల్చి లోపల ప్రవేశించి సొమ్ము కాస్తా తీసుకుని కారులో ఉడాయించేస్తారు," అన్నాడు.

రావమ్మ అంతా విని, "మీరు మీ మానాన రామకోటి రాసుకోండి."అంటూ మళ్ళీ కన్ను మూసుకున్నది.

"సీతప్పగారూ ! ఓ సీతప్పగారూ,"

"ఎవరో నన్ను పేరు పెట్టి పిలుస్తున్నారేవ్ ?" అన్నాడు సీతప్ప రహస్యంగా భార్యతో.

"మాట్లాడక పడుకోండి," అన్నది రావమ్మ నిద్రమత్తున.

హారన్ మోతలకు మనుషుల గొంతులు తోడయాయి. సీతప్ప రామకోటి రాయటం మానేసి బయటి కలకలం ఆలకించాడు.

చాలామంది చేరారు. మామూలు దొంగలు కారు, బందిపోటు దొంగలై ఉంటారు !

"దీపాలన్నీ వెలుగుతున్నాయి. ఎంత పిలిచినా పలకరేం. ఇంటిల్లిపాదీ విషం గాని పుచ్చుకోలేదు గద !"

"తాళం పగలగొట్టండి, చూస్తారేమిటి ?"

ఈవిధంగా బయటి జనం మాట్లాడటం విని సీతప్ప పెళ్ళాన్ని మళ్ళీ లేపాడు.

"వీధి వీధంతా లేచినట్టున్నారు. పోనీ ధైర్యంచేసి కిటికీలోంచి ఎవరు వారని కేక పెడతావా ఏవిటి ?" అన్నాడు.

"ఆపని మీరే చేద్దురూ — చంపకా !" అన్నది రావమ్మ. సోమిదేవి కమ్మలు మెచ్చుకుంటున్నట్టు ఆరంభమైన కల కాస్తా భగ్నమయింది.

విధిలేక సీతప్ప బయటిగది కిటికీ దాకా వెళ్ళి, వణుకుతున్న గొంతుతో, "ఎవరూ ?" అన్నాడు.

"తలుపు తియ్యవయ్యా, వెర్రి బ్రాహ్మడా !" అన్నాడు యజమాని. ఒక వందమంది గొల్లున నవ్వుతూ మాట్లాడినట్టు సీతప్పకు వినిపించింది.

తన యజమానినా ఇంత సేపూ నిలబెట్టాడు ? అమ్మయ్యో, ఆయ నేమనుకుంటాడు ?

"జీతం నూరు రూపాయిలు. సాయంత్రం మీతోపాటు బీచికి షికారు రావాలంటే ఓ 50 రూపాయిలు స్పెషల్ ఎలవెన్సు"

"ఏమేవ్, వేగిరం! వేగిరం!" అన్నాడు.

"ఏం కావాలండీ?"

"తాళాలే! తాళపు చెవులు! అవతల కనిపెట్టుకున్నారు!......వస్తున్నానండయ్యా! ఒక్క క్షణం! వచ్చె! వచ్చె!......వేగిరం, వేగిర వంటూంటేనూ!"

ఎలాగైతేనేం తాళపు చెవులు దొరికాయి. గేటు తెరిచి సీతప్ప యజమానిని లోపలికి దయచెయ్యమన్నాడు. లోపలికి దయచెయ్యననీ, ఆ నగల పెట్టెలు ఇచ్చేస్తే వెళతాననీ అన్నాడు యజమాని.

సీతప్ప వారి నగల పెట్టెలు వారికి అప్పగిస్తూ, "ఒక్కసారి చూసుకోండి. ఎందుకైనా మంచిది. సొమ్ముతో కూడిన పని. అంత్యనిష్ఠూరంకన్న ఆది నిష్ఠూరం మేలన్నారు!" అన్నాడు.

వినిపించుకోనట్టుగా యజమాని నగల పెట్టెలు తీసుకుని కారు స్టార్టుచేస్తూ, "ఏమన్నా పోతే మీదే పూచీ!" అని వెళ్ళిపోయాడు...

మర్నాడు సీతప్ప ఆఫీసుకు వెళ్ళినప్పుడు గోవిందరావు, "సీతప్పగారూ, మీరు డబ్బు మహా దూబరా చేస్తారటగా. మన బాస్ అందరితోనూ అన్నారు," అన్నాడు.

"నేనా?" అన్నాడు సీతప్ప ఆశ్చర్యంతో.

"అవును! తెల్లవార్లూ దీపాలన్నీ వెలిగించి ఇంటిల్లిపాదీ గాఢనిద్రపోతారట?" అన్నాడు గోవిందరావు.

సీతప్పకు ఏడవాలనిపించింది. ★